సాక్షి
ప్రకాశం
సోమవారం। 4। నవంబర్। 2024



తెల్లబంగారానికి గడ్డు రోజులు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటకు నష్టం వాటిల్లింది. పొలాల్లో నీరు నిలిచి పైరు ఎర్రగా మారి ఒడలిపోయింది. చీడ పీడలు ఆశించి దిగుబడి తగ్గింది. - 8లో..



బావమరిది కళ్లలో ఆనందం కోసం..

ఓ టీడీపీ నేత తన బావమరిది కళ్లలో ఆనందం కోసం రూ.10 లక్షల ప్రభుత్వ నిధులతో అతని ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించడం వివాదాస్పదమైంది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు జిల్లా స్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

నాగులుప్పలపాడు: ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అండర్ 14, అండర్ 17 విభాగాల్లో క్రికెట్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక సోమవారం మండలంలోని కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి ఎండీ హజీరా బేగం తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు తమకు అర్హత ఉన్న సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు కనపర్తి ఉన్నత పాఠశాలలోని పీఈటీ సుల్తాన్ బాషాకు రిపోర్టు చేయాలన్నారు.

అర్ధ శతాబ్దోత్సవ సభను జయప్రదం చేయండి

- రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్

ఒంగోలు సిటీ: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 ఏళ్ల వార్షికోత్సవాల సందర్భంగా నవంబరు 5న విజయవాడలో నిర్వహించే అర్ధశతాబ్దోత్సవ సభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ 50 సంవత్సరాల నుంచి రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అవిశ్రాంతంగా పోరాటం చేసిందన్నారు. శాస్త్రీయ విద్యే ధ్యేయంగా, అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేసిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు తన గళాన్ని వినిపిస్తోందన్నారు. 50 ఏళ్ల విద్యార్థి ఉద్యమాన్ని సమీక్షించుకొని, భవిష్యత్తు పోరాటాన్ని రూపొందించుకునేందుకు జరుగుతున్న ఈ అర్ధ శతాబ్ద ఉత్సవ సభను జయప్రదం చేయాలని అన్ని వర్గాల వారికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యామ్, నాయకులు అన్వేష్, కె.సుధాకర్, లక్ష్మణరావు, నిరంజన్, ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములును అవమానించిన చంద్రబాబు

- ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్



ఒంగోలు టౌన్: నవంబర్ 1వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించకుండా ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును ముఖ్యమంత్రి చంద్రబాబు అవమానించారని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. టీటీడీ పాలక మండలిలో కనీసం ఒక ఆర్యవైశ్యుడికి కూడా స్థానం కల్పించని చంద్రబాబు తాజాగా పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించాల్సి వస్తుందన్న కారణంతో ఏకంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరపకుండా వేడుకలను పక్కన పెట్టేశారని మండిపడ్డారు. ఆర్యవైశ్యుల ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడం చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడి అమరుడైన పొట్టి శ్రీరాములును అవమానపరిచిన చంద్రబాబు ఆర్యవైశ్యులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు నియమించిన ఏ ఒక్క కమిటీలోనూ ఆర్యవైశ్యులకు ఎందుకు స్థానం కల్పించలేదో చెప్పాలని నిలదీశారు. పొట్టి శ్రీరాములు త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది కనుక నవంబరు 1వ తేదీనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఆర్యవైశ్యులు చేసిన విజ్ఞప్తిని గౌరవించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే నవంబరు 1వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రకటించడమే కాకుండా, ఘనంగా నిర్వహించారని గుర్తు చేశారు. తద్వారా ఆర్యవైశ్య జాతిని జగన్ మోహన్ రెడ్డి గౌరవించారన్నారు. అంతేకాకుండా టీటీడీ పాలక మండలితోపాటుగా విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయం సహా పలు దేవాలయాలు, ఇతర కమిటీల్లో, కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఆర్యవైశ్యులకు జగన్ కేటాయించారని తెలిపారు. ఎన్నికల్లో చంద్రబాబు మాయమాటలను నమ్మిన ఆర్యవైశ్యులు ఆయనకు ఓటేసి అధికారం అప్పగించారని, అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే చంద్రబాబు తన నిజస్వరూపం చూపిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం గురించి కానీ, అమరజీవి త్యాగాల గురించి కానీ కనీసం స్మరించకపోవడంపై బీజేపీ, జనసేన పార్టీలు తక్షణమే స్పందించి నిలదీయాలని కోరారు.

చౌక దుకాణాలపై పచ్చ గద్దలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి తెలుగు తమ్ముళ్ల జేబులు నింపడంలోనే నిమగ్నమైంది. అధికారం ఉన్నది తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసమే అన్నట్లు వ్యవహరిస్తోంది. వివిధ శాఖల్లో ఏళ్ల తరబడి పార్టీలకు అతీతంగా పనిచేస్తున్న వారిని బలవంతంగా తొలగించి తమ వారికి కట్టబెడుతోంది. జిల్లాలో పౌరసరఫరా శాఖ డీలర్లలో 80 శాతానికిపైగా బలవంతంగా రాజీనామా చేయించి కూటమి పార్టీల వారికి డీలర్‌షిప్‌లు అప్పగిస్తున్నారు. అధికారులు సైతం టీడీపీ ఎమ్మెల్యేలకు జీహుజూర్ అంటూ వారు చెప్పినట్టల్లా ఆడుతూ డీలర్లను బెదిరింపులకు గురి చేసి వారిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.

జిల్లాలో రేషన్ కార్డులు: **6,78,160**

రేషన్ షాపులు: **1392**

ఎండీయూ వాహనాలు: **385**

- రేషన్ డీలర్‌షిప్‌ల కోసం కూటమి నేతల కుట్రలు
- రేషన్ షాపులను టీడీపీ వారికి కట్టబెట్టేందుకు రంగంలోకి అధికారులు..
- డీలర్లపై అక్రమంగా కేసులు బనాయిస్తూ రాజీనామాలు చేయాలని బెదిరింపులు
- 30 ఏళ్ల నుంచి పర్మినెంట్ రేషన్ షాపులు నిర్వహిస్తున్న వారిపై కూడా తీవ్ర ఒత్తిడి
- రాజీనామా చేయని డీలర్లకు నరుకులు ఇవ్వకుండా వేధింపులు

ఒంగోలు అర్బన్: కూటమి నేతల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. వివిధ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెదిరించి బలవంతంగా తొలగించి వారి స్థానంలో కూటమి పార్టీలకు చెందిన వారిని ఉంచుతున్నారు. పౌరసరఫరాల శాఖలో ఏళ్ల తరబడి డీలర్లుగా ఉంటున్న వారిని సైతం తొలగిస్తున్నారు. జిల్లాలో 6,78,160 రేషన్ కార్డుదారులు, 1392 రేషన్‌షాపులున్నాయి. 385 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు.

డీలర్లపై సివిల్ సప్లయిస్ అధికారుల ఒత్తిడి:

అధికార పార్టీ నేతలకు సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు జీ హుజూర్ అంటూ రేషన్‌డీలర్లపై అక్రమంగా కేసులు నమోదు చేస్తూ రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నారు. బలవంతపు రాజీనామాలు చేయించి కూటమి పార్టీ సానుభూతిపరులకు కట్టబెడుతున్నారు. మాకు.. మీకు ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవు.. స్థానిక ఎమ్మెల్యేల ఒత్తిడితోనే ఇలా చేయాల్సి వస్తుందని, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి విషయాన్ని తేల్చుకోవాలని, లేకుంటే కేసులు తప్పవని అధికారులే పాత డీలర్లకు చెప్పడం గమనార్హం. రేషన్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత దాదాపు 30 ఏళ్ల పైబడి రెండు మూడు తరాలుగా రేషన్ షాపులు నిర్వహిస్తున్న వారిని కూడా కనికరించకుండా బెదిరింపులతో రాజీనామాలు చేయించేలా అటు కూటమి నాయకులు, ఇటు అధికారులు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

ఇప్పటికే దాదాపు 80 శాతం పైగా రేషన్ షాపులు కూటమి పరం

జిల్లాలో దాదాపు 1392 రేషన్ షాపులు ఉండగా వాటిలో ఇప్పటికే 80 శాతం పైగా షాపులను కూటమి మనుషులకు కట్టబెట్టారు. కొన్ని షాపులు పాత డీలర్లతో రాజీనామాలు చేయించి ఇస్తే.. మరికొన్ని షాపులు పాత డీలర్ల పేరుతోనే ఉంచి టీడీపీ నేతలు షాపులు నిర్వహించేలా సెటిల్ చేశారు. దీంతో ఇప్పటి వరకు రేషన్ షాపులు నిర్వహించే వాళ్లు రోడ్డున పడ్డారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పర్మినెంట్ డీలర్‌లుగా కొనసాగుతున్న వారి జోలికి ఇంతవరకు ఎప్పుడూ వెళ్లలేదు. కానీ టీడీపీ నేతలు ఇప్పుడు పర్మినెంట్ డీలర్లను కూడా వదలడంలేదు. వాటిలో కొన్ని రేషన్ షాపులైతే ఒంటరి మహిళలే నడుపుతున్నారు. తండ్రులు, భర్తలు మరణించడంతో ఒంటరి మహిళలే రేషన్ షాపులు నిర్వహిస్తున్న సందర్భాలు జిల్లాలో ఉన్నాయి. వారిపైనా కూటమి నాయకులు కనికరం లేకుండా వారిపై రాజీనామా చేయాలంటూ అధికారులతో ఒత్తిళ్లు చేయిస్తున్నారు. రాజీనామాలు చేయని డీలర్లకు రేషన్ సరుకులు సరఫరా చేయకుండా నిలువరించడం, రేషన్ పంపిణీ సమయంలోను కనీసం కింద పడి కేజీ, అరకేజీ తగ్గినా కేసులు పెట్టేలా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధిత డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి డీలర్లకు అక్కడి నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసేవారు. ఇప్పుడు రాజీనామా చేయని డీలర్లకు సరుకులు పంపకుండా నేరుగా ఎండీయూ ఆపరేటర్లకు సరుకులు పంపిణీ చేస్తూ డీలర్లను దూరం పెడుతున్నారు.

జిల్లాలో బలవంతంగా డీలర్‌షిప్ మార్చిన కొన్ని రేషన్ షాపులివీ..

జిల్లా కేంద్రం ఒంగోలులో గత 30 ఏళ్లుగా రేషన్ షాపు నిర్వహిస్తున్న ఒక మహిళ షాపును ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు చేసేందుకు వెళ్లి వారే అదనపు బియ్యం బస్తాలను ఆమె ముందు నుంచే షాపులో దింపి, కేసు నమోదు చేస్తున్నామని రిపోర్టు రాశారు. దానిపై సంతకం చేయాలని ఆ ఒంటరి మహిళపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో ఆ మహిళ తమ పిల్లలతో సహా స్థానిక ఎమ్మెల్యేను కలిసి తన షాపును వదిలిపెట్టాలని బతిమిలాడినా ఒప్పుకోలేదు. చివరకు రాజీనామా చేస్తేనే కేసు లేకుండా వదిలేసి ఆ షాపును టీడీపీకి చెందిన వారికే కేటాయించారు.

- ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి ఒంగోలు మండలం రూరల్, అర్బన్‌లో మొత్తం 102 రేషన్ షాపులు ఉన్నాయి. వాటిలో దాదాపుగా 95 రేషన్ షాపులు పాత వారితో బలవంతపు రాజీనామాలు చేయించి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారు. అదేవిధంగా కొత్తపట్నం మండలంలో 36 రేషన్ షాపులు ఉంటే వాటిలో ఇప్పటికే 18 షాపులు పాతవారిని రద్దు చేసి కూటమి నేతలకు అప్పగించారు.
- సింగరాయకొండలో గత 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న 4 రేషన్ షాపుల డీలర్లతో బలవంతపు రాజీనామాలు చేయించారు. వీటిలో ఒక పర్మినెంట్ షాపునకు సంబంధించి ఒక డీలర్ అప్పటికే అనారోగ్యంతో ఉండగా ఈ బలవంతపు రాజీనామాతో తీవ్ర మనస్థాపం చెంది మరణించాడు. చివరికి ఎస్టీ సామాజికవర్గానికి చెందిన డీలర్లను కూడా వదిలిపెట్టలేదు. వారితోను బలవంతపు రాజీనామాలు చేయించి రేషన్ షాపులను కూటమి వ్యక్తులకు ధారదత్తం చేశారు.
- యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 173 రేషన్ షాపులు ఉంటే వాటిలో 143 షాపులకు సంబంధించి పాత డీలర్లను మార్చి టీడీపీకి చెందిన వారికి కట్టబెట్టారు.
- మార్కాపురం పట్టణంలో మొత్తం 32 రేషన్ షాపులు ఉంటే వాటిలో 24 మంది డీలర్లతో బలవంతపు రాజీనామాలు చేయించి టీడీపీ నాయకులకు అప్పగించారు. అదేవిధంగా మార్కాపురం మండలంలో మొత్తం 61 షాపులు ఉంటే 49 మంది డీలర్లు రాజీనామా చేయించి కూటమి పార్టీలకు చెందిన వారికి ఇచ్చారు.
- సీఎస్‌పురం మండలంలో మొత్తం 35 రేషన్ షాపుల్లో 32 షాపులు పాత డీలర్లను తొలగించి కొత్తవారికి అప్పగించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది.
- తర్లుపాడు మండలంలో మొత్తం 19 రేషన్ షాపులుంటే వాటిలో 9 పర్మినెంట్ షాపులు ఉన్నాయి. మొత్తం 11 రేషన్ డీలర్లతో బలవంతపు రాజీనామాలు చేయించి వారిని రోడ్డుపాలు చేశారు.
- పామూరు మండలంలో మొత్తం 44 రేషన్ షాపులకు సంబంధించి 22 మందితో రాజీనామాలు చేయించి కొత్త వారికి కేటాయించారు.
- కురిచేడు మండలంలో మొత్తం 26 రేషన్ షాపులు ఉంటే వాటిలో 23 షాపులు పాత డీలర్లను తొలగించి కొత్త వారికి ఇచ్చారు.
- దర్శి మండలంలో 36 రేషన్ షాపులు ఉంటే టీడీపీ నాయకులు 30 మంది డీలర్ల చేత దౌర్జన్యంగా సంతకాలు చేయించి షాపులు లాక్కున్నారు.

కబడ్డీ క్రీడకు మరింత వన్నె తేవాలి



మాట్లాడుతున్న ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి



జిల్లా నూతన కార్యవర్గం

- ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి

ఒంగోలు: నూతన కార్యవర్గం కబడ్డీ క్రీడకు మరింత వన్నె తీసుకురావాలని ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి అన్నారు. స్థానిక ఆస్టోనా ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ప్రకాశం జిల్లా నూతన కార్యవర్గ ఎంపికకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ క్రీడకు పెట్టింది పేరన్నారు. జిల్లాల విభజన తరువాత తొలిసారిగా 26 జిల్లాలకు 26 అసోసియేషన్లు ఏర్పాటు చేస్తున్నారని, ప్రకాశం జిల్లాలో కబడ్డీని బలోపేతం చేయడంలో నూతన కార్యవర్గానికి అత్యంత బాధ్యత ఉంటుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీకాంత్ మాట్లాడుతూ దేశంలోనే నేడు కబడ్డీ నెంబర్ 2 స్థానంలో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటోందన్నారు. ప్రస్తుతం ప్రో కబడ్డీ సీజన్ నడుస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా కబడ్డీ లీగ్ కూడా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ లీగ్ ద్వారా క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు వస్తాయని, ప్రకాశం జిల్లానుంచి అంతర్జాతీయ క్రీడాకారులు గతంలో ఉన్నారని, మళ్లీ అటువంటి క్రీడాకారులను తయారుచేసి ప్రోకబడ్డీలో సైతం ప్రకాశం సత్తా చాటుతుందని ఆశిస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ నల్లూరి సుబ్బారావు ఇక నుంచి ప్రతి ఏటా జిల్లాలో జరిగే కబడ్డీ క్రీడల నిర్వహణకు రూ.2 లక్షలు అందిస్తామని ప్రకటించారు. అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు అన్ను వేణుగోపాల్ మాట్లాడుతూ తమిళనాడు ప్రీమియర్ లీగ్ తరహాలో తెలుగు కబడ్డీ ప్రీమియర్ లీగ్ నిర్వహించేందుకు ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రా అసోసియేషన్ల మధ్య చర్చ నడుస్తోందని త్వరలోనే వివరాలు వెల్లడిస్తారన్నారు. అనంతరం నూతన కార్యవర్గ ఎంపిక ప్రక్రియకు ఎన్నికల అధికారిగా హాజరైన హైకోర్టు రిటైర్డ్ జడ్జి జె.రామారావు ఎన్నికల నిబంధనలు వివరించి నూతన ఎంపిక ప్రక్రియను పూర్తిచేశారు.

జిల్లా అధ్యక్షునిగా కుర్రా భాస్కరరావు:

చైర్మన్‌గా ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ నల్లూరి సుబ్బారావు, అధ్యక్షునిగా కుర్రా భాస్కరరావు, సీనియర్ ఉపాధ్యక్షుడిగా సిరిగిరి రంగారావు, ఉపాధ్యక్షునిగా కె.ప్రసాదరావు, ఈదర వెంకట సురేష్‌బాబు (చిన్నారి), ఆరికట్ల సుమతి, దయానంద్, జి.శ్రీనివాసరావు, కోశాధికారిగా డి.రమేష్, కార్యదర్శిగా వై.పూర్ణచంద్రరావు, సీనియర్ జాయింట్ సెక్రటరీగా ఎం.హనుమంతరావు, జాయింట్ సెక్రటరీలుగా పి.హజరత్తయ్య, ఇజ్రాయేల్, కార్యనిర్వాహక సభ్యులుగా పి.అంకబాబు, కె.శ్రీలక్ష్మి, వై.కన్నయ్య, కె.హనుమంతరావు, ఎం.వీరాస్వామి, ఎండి హజీరాబేగం, శివ సిసింద్రి, తోట బాలాంజనేయులు, వై.బాలగురవయ్య, పి.దామోదర్‌రెడ్డి, ఎ.రవికిరన్, వై.బాబు, కె.మల్లికారాణి, ఎం.మోహన్‌రావు, రమణారెడ్డిని ఎంపిక చేశారు.

రోడ్ల విస్తరణపై ఉత్కంఠ

- ఆదివారం తొలగింపులకు తాత్కాలిక బ్రేక్
- 30 అడుగులకు స్వచ్ఛంద ఆక్రమణల తొలగింపుపై కొన 'సా..గుతున్న చర్చ'
- అంగీకరించపోతే గురువారం వేటు తప్పదంటున్న టీపీఎస్



పట్టణంలో రోడ్ల విస్తరణ

కనిగిరి రూరల్: మున్సిపల్ అధికారులు చేపట్టిన రోడ్ల విస్తరణలో భాగంగా ఆక్రమణల తొలగింపుపై పట్టణ ప్రజల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. శనివారం రాత్రి బొడ్డు చావిడి సెంటర్‌లోని.. బొడ్డు చావిడి టు నాజ్ సెంటర్ వరకు వ్యాపారులు, గృహ నిర్మాణదారులతో మున్సిపల్ అధికారుల భేటీ జరిగింది. అందులో కనీసం 34 అడుగులు రోడ్డు విస్తరణకు సహకరించాలని, లేకపోతే పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం 40 అడుగుల రోడ్డు విస్తరణ చేపడతామని కమిషనర్ డానియల్ జోసఫ్, టీపీఎస్ సువర్ణ కుమార్ వ్యాపారులకు స్పష్టం చేశారు. మళ్లీ వ్యాపారుల విన్నపం మేరకు ఆదివారం మున్సిపల్ అధికారులు..అక్రమణదారులతో సమావేశం నిర్వహించారు. రోడ్ల విస్తరణకు సహకరించాలని కోరారు. కనీసం 30 అడుగుల రోడ్ల విస్తరణకు అంగీకారం తెలుపకపోతే చట్టప్రకారం పూర్తి స్థాయిలో మున్సిపల్, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న 40 అడుగుల రోడ్డు వెడల్పు చర్యలను గురువారం చేపడతామని, అందులో ఎలాంటి సందేహం లేదని..వ్యాపారులు, గృహ నిర్మాణదారులకు తెగేసి చెప్పినట్లు టీపీఎస్ సువర్ణ కుమార్ వెల్లడించారు.

రోడ్ల విస్తరణ ప్రక్రియకు ఆదివారం తాత్కాలిక విరామం

కారణాలు ఏమైనా రోడ్ల విస్తరణ కార్యక్రమానికి ఆదివారం తాత్కాలిక బ్రేక్ పడింది. శనివారం జరిగిన మెట్ల తొలగింపు, తాత్కాలిక షెడ్లు, రేకుల తొలగింపులో వచ్చిన వ్యర్థాలను తొలగించేందుకు సమయాన్ని కేటాయించి కాలయాపన చేశారు. కొందరి పెద్ద కట్టడాల జోలికి వెళ్ల లేదనే విమర్శలు వెల్లువెత్తాయి.

ఆలయాల్లో సినీనటుడు సుమన్ పూజలు



త్రిపురాంతకం ఆలయాల్లో పూజలు చేస్తున్న సినీ నటుడు సుమన్

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం బాలా త్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో సినీనటుడు సుమన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయాల సమీపంలోని గౌడ వన భోజనాలలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆలయాలను సందర్శించారు. సుమన్‌కు ఈఓ చెన్నకేశవరెడ్డి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు, స్వామివారి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు వచ్చి సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

రాష్ట్రంలో దళితులపై పెరిగిన దాడులు



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ హయాంలో దళిత మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీ సుందరం అన్నారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ 18వ వార్షికోత్సవం సందర్భంగా గోడ పత్రికను ఆదివారం ఒంగోలులోని ఆ పార్టీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీ సుందరం మాట్లాడుతూ 18వ వార్షికోత్సవ సభను డిసెంబర్ 26వ తేదీ విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. దళిత, గిరిజనుల హక్కులను హరిస్తున్నాయని చెప్పారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ముగ్గురు దళితులపై అత్యంత దారుణంగా దాడులకు పాల్పడ్డారన్నారు. బాపట్ల జిల్లాలో చింతల శ్రీను ఆత్మహత్యకు కారకులయ్యారని చెప్పారు. యర్రగొండపాలెంలో ఫారెస్టు అధికారులు ఒక గిరిజనుడి ఆత్మహత్యకు కారకులయ్యారన్నారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

తాగుతూ.. తూగుతూ



పొదిలి మండలం సలకనూతల వద్ద మద్యం మత్తుతో ముళ్లపొదల్లో పడిఉన్న వ్యక్తి



కంభం బస్టాండు ఆవరణలో ఓ టైరు మీద మద్యం మత్తులో జోగుతున్న వ్యక్తి

విచ్చల విడిగా ఏర్పాటైన ప్రైవేటు మద్యం దుకాణాలతో మందుబాబులకు అన్ని వేళలా మద్యం అందుబాటులో ఉంటోంది. మద్యం దుకాణాల్లో అనుమతులు లేకున్నా సిట్టింగ్ రూములు నడుపుతున్నారు. దీంతో పాటు గ్రామాల్లో సైతం బెల్టు షాపులు వెలుస్తుండటంతో ఎక్కడ పడితే అక్కడే మద్యం తాగేసి మందు బాబులు రోడ్లపై తూగుతూ తిరుగుతున్నారు. కంభం బస్టాండులో ఆదివారం ఓ వ్యక్తి మద్యం మత్తులో బస్సు టైరుపై పడిపోయాడు. పొదిలి మండలం సలకనూతలకు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి ద్విచక్ర వాహనంపై వస్తూ మాదాలవారిపాలెం-సలకనూతల మధ్య అదుపు తప్పి కింద పడి ముళ్లచెట్లలో స్పృహ కోల్పోయాడు.

– కంభం/పొదిలి రూరల్

కూటమి ప్రభుత్వంలో నేడు తొలి డీఆర్‌సీ

ఒంగోలు అర్బన్: జిల్లా అభివృద్ధిపై నిర్వహించే డీఆర్‌సీ (జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ) సమావేశం కూటమి ప్రభుత్వంలో తొలిసారి సోమవారం నిర్వహించనున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్, తాగునీరు, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ శాఖలకు సంబంధించి డీఆర్‌సీ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయానికి సంబంధించి ఇప్పటి వరకు రైతులకు ఎటువంటి ఆర్థిక సహాయం ప్రభుత్వం నుంచి చేయలేదు. గత ప్రభుత్వంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా వంటి పథకాలతో అండగా నిలిచారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి గత ప్రభుత్వంలో ప్రాథమిక వైద్యశాలలు నాడు-నేడు కింద అభివృద్ధి చేసి అన్నీ వసతులను సమకూర్చారు. జిల్లాలోని మెడికల్ కాలేజీకి పీజీ సీట్లను పెంచడంతో పాటు మార్కాపురంలో కొత్త మెడికల్ కాలేజీకి శ్రీకారం చుట్టారు. రెవెన్యూ శాఖకు సంబంధించి వ్యవసాయ భూములతో పాటు ఇళ్ల స్థలాలు టీడీపీ ప్రభుత్వంలో చుక్కల భూములుగా, ప్రభుత్వ భూములుగా మారడంతో వాటిని పరిష్కరించేందుకు కృషి చేశారు. రీసర్వేతో భూముల సమస్యలను శాశ్వతంగా తొలగించడంతో పాటు శాశ్వతంగా రికార్డులు ఉండేలా అధునాతన టెక్నాలజీతో చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నిర్వహించే తొలి డీఆర్‌సీలో కొత్తగా ఏ అభివృద్ధి పనులపై చర్చిస్తారో చూడాలి. రాష్ట్ర విభజన అనంతరం 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో డీఆర్‌సీ సమావేశం ఒక్కటి కూడా నిర్వహించలేదు. దీన్ని బట్టి టీడీపీ ప్రభుత్వానికి జిల్లా అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 వరకు మొత్తం ఏడు సార్లు డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించి జిల్లా అభివృద్ధికి కృషి చేశారు.

క్లుప్తంగా

బెల్టు షాపు నిర్వాహకురాలు అరెస్టు


పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్సై

నాగులుప్పలపాడు: అక్రమంగా మద్యం నిల్వ చేసి గుట్టుగా అమ్మకాలు జరుపుతున్న మహిళను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ముద్దన పద్మ దుకాణంపై దాడి చేసి 4 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి


మృతిచెందిన ఆదయ్య (ఫైల్)

కొమరోలు: రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతిచెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఆదయ్య (78)కు మతిస్థిమితం లేదు. పోరుమామిళ్లలోని తన కుమార్తె వద్దకు వెళ్లాడు. అక్కడ కాలకృత్యాలు తీర్చుకోవడానికి సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ తెలుగుగంగ ప్రాజెక్టులో పడి ఆదయ్య గల్లంతయ్యాడు. ఆదయ్య మృతదేహాన్ని వైఎస్సార్ జిల్లాలోని గండ్లేరు వాగు జలాశయంలో శనివారం పోలీసులు గుర్తించారు. దర్యాప్తు అనంతరం ఆదయ్య కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తరలించారు.

రామాపురంలో డెంగీ కేసు


బాధితురాలి నివాసం వద్ద బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

పొదిలి రూరల్: మండలంలోని రామాపురంలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన గర్భిణి పుట్టా సుప్రజకు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించారు. ప్రస్తుతం ఒంగోలు జీజీహెచ్‌లో ఆమె చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఆశా వర్కర్లు సుప్రజ నివాసం ఉండే వీధిలో పారిశుద్ధ్య పనులు, క్లోరినేషన్ చేపట్టారు. ఆమె కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు.

చెరువులో పడిన యువకుడు


శ్రీరామ్ (ఫైల్)

దర్శి: చేపల వేటకు వెళ్లి చెరువులో యువకుడు పడిన సంఘటన దర్శి నగర పంచాయతీ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దర్శి పట్టణంలోని సందువారిపాలెం గ్రామానికి చెందిన తలపాటి శ్రీరామ్ (18) చింతలపాలెం గ్రామం వద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో జారి చెరువలో పడి మునిగిపోయాడు. అనంతరం కనిపించకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యార్థి మృతదేహం వెలికితీత


దుర్గాప్రసాద్ మృతదేహం


దుర్గాప్రసాద్ (ఫైల్)

అద్దంకి రూరల్: అద్దంకిలో శనివారం బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలో దూకిన ఇంటర్ విద్యార్థి దాట్ల దుర్గాప్రసాద్ (18) మృతదేహాన్ని పోలీసులు, ఫైర్ సిబ్బంది, ఒంగోలు నుంచి వచ్చిన రెస్క్యూ టీం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలించి వెలికితీశారు. అద్దంకి పట్టణంలోని గరటయ్యకాలనీ 19వ లైన్‌లో నివాసం ఉంటున్న దాట్ల శ్రీనివాసరావు కుమారుడు దాట్ల దుర్గాప్రసాద్ అద్దంకిలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల నుంచి తోటి విద్యార్థులతో కలిసి విహార యాత్రకు వెళ్లాలని తల్లిదండ్రులను డబ్బులు అడగ్గా.. యాత్రకు వద్దని వారు అన్నారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని స్నేహితులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎస్సై ఖాదర్ బాషా పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కాలువలు విలవిల..!



నాగులుప్పలపాడు వద్ద గుర్రపుడెక్కతో నిండిన కాలువ



గుండ్లాపల్లి వద్ద చిల్లచెట్లతో నిండి కుంచించుకుపోయిన గుండ్లకమ్మ డ్యాం కుడికాలువ

నీటి ప్రవాహంతో కళకళలాడాల్సిన కాలువలు చిల్లచెట్లు, నాచుతో నిండిపోయి విలవిల్లాడుతున్నాయి. జిల్లాకు తాగునీరు, సాగునీరు సరఫరా చేసే ప్రధానమైన సాగర్ కాలువలు మొదలు.. గుండ్లకమ్మ డ్యాం కాలువల వరకూ పూడికతో నిండిపోయాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ కూడా ప్రారంభమైంది. అయినప్పటికీ సాగునీటి సరఫరా, వాటికి సంబంధించిన కాలువల గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. తాగునీటి సరఫరాకు సైతం ఈ కాలువలే ఆధారం. కానీ, సంబంధిత అధికారులుగానీ, పాలకులుగానీ కాలువలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ కాలువలు నిలుస్తున్నాయి.

– సాక్షి, ఒంగోలు


మంగమూరు సమీపంలో చెట్ల మధ్య కూలిపోయే స్థితిలో ఉన్న సాగర్ కెనాల్ కల్వర్టు


చీమకుర్తి సమీపంలో శిథిలావస్థలో సాగర్ కెనాల్ లాకులు


కామేపల్లివారిపాలెం వద్ద కాలువలోని లాకుల మధ్య కూలేందుకు సిద్ధంగా ఉన్న దిమ్మె


అమ్మనబ్రోలు వద్ద కాలువ దుస్థితి..


చంద్రపాలెం వద్ద సాగర్ కెనాల్‌లో చెట్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న నీరు

తెల్లబంగారానికి గడ్డు రోజులు..!


గంగంపల్లెలో సాగుచేసిన పత్తి


సోమిదేవిపల్లెలో వర్షాలకు ఎర్రగా మారి ఒడలిపోయిన పత్తి పైరు

- వర్షానికి దెబ్బతిన్న పత్తి
- పెరిగిన ఖర్చులు.. తగ్గిన దిగుబడి
- రోజురోజుకూ పతనమవుతున్న ధర
- ధరలు దిగ్గోసి దోచుకుంటున్న దళారులు
- కూలీల కొరతతో రైతులకు అదనపు కష్టాలు

రాచర్ల: పత్తి పంట సాగుచేసిన రైతులు తెల్లబోతున్నారు. పంట సాగుకు ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడి తగ్గడం, కనీసం గిట్టుబాటు ధర కూడా లభించే పరిస్థితి లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతింది. పూత దశలో అకాల వర్షం కారణంగా పూత పూర్తిగా రాలిపోయింది. దీంతో వేలాది రూపాయల పెట్టుబడులు గాలివానకు కొట్టుకుపోయాయి. రైతులు నష్టపోయి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. వర్షం తగ్గిన తర్వాత కూడా పొలాల్లో నీరు నిలిచి పత్తి పైరు ఎర్రగా మారి ఒడలిపోయింది. చీడపీడలు ఆశించి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది.

జిల్లాలో 30,325 ఎకరాల్లో పత్తి సాగు...

జిల్లాలో ఈ ఏడాది 30,325 ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. గిద్దలూరు డివిజన్‌లో 2,732 ఎకరాల్లో పత్తి పంట సాగుచేయగా, అత్యధికంగా రాచర్ల మండలంలో 1,707 ఎకరాల్లో సాగుచేశారు. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ధరలు.. కూలీలు దొరక్క రైతుల అవస్థలు...

సాగు ఖర్చులు పెరగడంతో పాటు కూలీల కొరతతో పత్తి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీలు ఇష్టానుసారంగా కూలి రేట్లు పెంచుతుండటంతో ఏం చేయాలో తెలియక రైతులు దిగాలు పడుతున్నారు. పత్తి తీసేందుకు ఇతర ప్రాంతాల నుంచి ఆటోల్లో కూలీలను తీసుకొస్తున్నారు. క్వింటా పత్తి తీసేందుకు రూ.2 వేలు ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు. పంట పొలాలపై అధిక పెట్టుబడులు పెట్టి పండించిన పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో మరింత నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

కొనుగోలు కేంద్రాలేవీ..?

ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు తక్కువ ధరలకు పత్తి కొనుగోలు చేసి రైతులను నిండా ముంచుతున్నారు. క్వింటాను రూ.5 వేల నుంచి రూ.5,500 వరకు మాత్రమే కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.7,121 మద్దతు ధర ప్రకటించినప్పటికీ సీసీఐ కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


ఆటోలో వెళ్తున్న కూలీలు

కూలీల కొరత తీవ్రంగా ఉంది :



నేను రెండు ఎకరాల్లో పత్తి, 2 ఎకరాల్లో పొగాకు పంట సాగుచేశా. పత్తి తీసేందుకు కూలీలు దొరక్క పక్క గ్రామాల నుంచి కూలీలను రెట్లు పెంచి తీసుకురావడంతో ఖర్చులు పెరిగాయి. క్వింటా పత్తి తీసేందుకు రూ.2 వేలకు పైగా ఖర్చు వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి తడిచి నల్లగా మారింది. దీనికితోడు పత్తికి గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నాం.

కే మౌలాపీరా, అనుమలవీడు, రైతు

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి :



ప్రభుత్వం పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం మద్దతు ధర రూ.7,121 ఉండగా, దళారులు క్వింటా రూ.5 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అసలే ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గిందని ఇబ్బందులు పడుతుంటే.. కూలీల కొరత అదనపు సమస్యగా మారింది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ఎ.పుల్లారెడ్డి, గంగంపల్లె, రైతు

బిల్డింగ్‌పై నుంచి జారిపడి కూలీ మృతి


పవన్ కుమార్ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

అద్దంకి రూరల్: బిల్డింగ్ పైనున్న వేస్టును కిందకు పోస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి కూలీ మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం అద్దంకిలో చోటుచేసుకుంది. మృతుడి భార్య ఫిర్యాదుతో ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బీసీ బాలుర వసతి గృహం వద్ద నివాసం ఉంటున్న తోమట్ల పవన్ కుమార్ (38) కూలి పనులు చేసుకుంటూ నివాసం ఉంటున్నాడురు. ఆదివారం ఉదయం స్థానిక రంగారావు ప్రైవేటు వైద్యశాలలో దాబాపై వాటర్ ట్యాంక్ పగలగొట్టే పనికి వెళ్లాడు. పనిలో భాగంగా సాయంత్రం వేస్టు డస్ట్‌ను పైనుంచి కింద ఉన్న ట్రాక్టర్‌లోకి పోస్తున్నారు. ఈ క్రమంలో జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్య అంజలి అక్కడికి చేరుకుని భోరున విలపించింది.

తగలబడిన కారు


తగలబడుతున్న కారు

ఒంగోలు టౌన్: నగరంలో పార్క్ చేసి ఉన్న కారు తగలబడింది. టూ టౌన్ పోలీసు స్టేషన్లో బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ సీహెచ్ శేషగిరికి చెందిన ఈ కారును కొత్తపట్నం బస్టాండ్ పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా పార్క్ చేసి ఉన్నారు. రాత్రి 8 గంటల సమయంలో కారులోంచి అకస్మాత్తుగా దట్టమైన పొగలు వచ్చాయి. చూస్తూ ఉండగానే మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. వెంటనే చేరుకున్న ఫైరింజన్ మంటలను ఆర్పివేసింది. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి హాని జరగలేదు.

బావమరిది కళ్లలో ఆనందం కోసం..!

- రూ.10 లక్షల ప్రభుత్వ నిధులతో టీడీపీ నేత ఇంటికి రోడ్డు
- మార్కాపురం మండలం దరిమడుగులో వివాదాస్పదంగా రోడ్డు నిర్మాణం


దరిమడుగు ఆటోనగర్‌లో అధ్వానంగా ఉన్న ఓ మట్టి రోడ్డు


టీడీపీ నేత బావమరిది ఇంటికి సీసీ రోడ్డు నిర్మాణం కోసం వేసిన కంకరచిప్స్

మార్కాపురం రూరల్: బావమరిది కళ్లలో ఆనందం కోసం ప్రభుత్వ నిధులతో బావ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం మార్కాపురం ప్రాంతంలో వివాదాస్పదమైంది. మండలంలోని దరిమడుగు గ్రామానికి చెందిన ఒక టీడీపీ నేత ఏకంగా 10 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బావమరిది ఇంటి వరకూ రోడ్డు వేయిస్తున్నాడు. ఇప్పటికే మట్టిరోడ్డు తవ్వి కంకరచిప్స్ వేశారు. రేపోమాపో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తిచేయనున్నారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు, టీడీపీ గ్రామ కార్యకర్తలు సైతం ఆశ్చర్యం,. ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెయిన్‌రోడ్డు నుంచి సరిగ్గా బావమరిది ఇంటివరకూ రోడ్డు ఏర్పాటు చేస్తున్నాడు. ఇప్పటికే ఈ టీడీపీ నేత వ్యవహారశైలితో ఆ గ్రామంతో పాటు టీడీపీ మండల నాయకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పంచాయతీలో ఎస్సీకాలనీతో పాటు గ్రామంలో పలు అంతర్గత రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఈ పంచాయతీలోనే ఉన్న ఆటోనగర్‌లో రోడ్లు లేక డ్రైవర్లు, వాహనాల యజమానులు, కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఇవన్నీ ఆ టీడీపీ నేతకు కనిపించడం లేదా..? అని గ్రామస్తులతో పాటు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే మండిపడుతున్నారు. బావమరిది కోసం ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సుమారు 200 మీటర్ల రోడ్డు నిర్మిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పలు ఎస్సీకాలనీల ప్రజలు సమస్యలతో సతమతమవుతుండగా, బావమరిది కోసం ప్రభుత్వ నిధులతో టీడీపీ నేత రోడ్డు నిర్మించడం తీవ్రస్థాయిలో విమర్శలకు తావిస్తోంది. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.